ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



పనిలేకపోవడంతో డీకేపల్లె పార్కు చేరిన ట్యాంకర్లు



కుప్పం మున్సిపాలిటీ డీకే పల్లె పార్కులోని మదర్ ప్లాంటు

ఎన్టీఆర్ సుజల.. కుప్పం ప్రజల దాహార్తిని తీర్చడంలో విజయవంతమైన పథకం. రెండు రూపాయలకే 20 లీటర్ల శుద్ధ జలాన్ని అందించడం ద్వారా ఖర్చు తగ్గించడంతోపాటు తాగునీటి కాలుష్య ప్రభావం నుంచి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించిన పథకం. వైసీపీ అయిదేళ్ల పాలనలో 20 లీటర్ల శుద్ధ జలం అయిదు రూపాయలకు పెరగడంతో పాటు నిర్వహణ లేమితో కునారిల్లి, చివరకు నామమాత్రావశిష్టంగా మారిన ఈ పథకాన్ని పునరుద్ధరించడానికి నేడు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిధులు కేటాయించినా, అమలుకు వచ్చేసరికి ఏదో సాంకేతిక అడ్డంకి అడుగులు ముందుకు వేయనీయడంలేదు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

'సుజలం' సఫలమయ్యేది ఎన్నడో!

2014-2019 నడుమ టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా ఎన్టీఆర్ సుజల పథకం అమలైంది. కుప్పంలోని డీకే పల్లె ఉద్యానవనంలో మదర్ ప్లాంటును అప్పటి మంత్రి లోకేశ్ ఘనంగా ప్రారంభించారు. ఇందుకోసం డీకే పల్లె చెరువులో అయిదు బోరుబావుల తవ్వకం అదనంగా జరిగింది. క్రమేణా పథకం నాలుగు మండలాలకూ విస్తరించింది. మొత్తం 9 మదర్ ప్లాంట్లు, 202 రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఆర్డీయూ)లతో నియోజకవర్గ ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో సైతం రెండు రూపాయలకే 20 లీటర్ల శుద్ధ జలాన్ని అందించి వారి తాగునీటి ఎద్దడి తీర్చడంతోపాటు కలుషిత నీటితో వచ్చే ఆరోగ్య ప్రమాదాలనుంచి ఎన్టీఆర్ సుజల పథకం రక్షించింది. సుమారు ఇరవై ట్యాంకర్ల దాకా మదర్ ప్లాంట్లనుంచి ఆర్డీయూలకు శుద్ధజలాన్ని సరఫరా చేసేవి. లక్షలాది లీటర్ల శుద్ధ జలాన్ని ఆర్డీయూలనుంచి ఏటీఎం లాంటి కార్డులను ఉపయోగించి ప్రజలు తీసుకుని వాడేవారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా గడిచిపోయిన రోజులవి.



డీకేపల్లె పార్కులో తుప్పు పడుతున్న ట్రాక్టర్లు

● వైసీపీ రావడంతోనే మంగళం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ సుజల పథకానికి గ్రహణం పడుతూ వచ్చింది. వైఎస్సార్ సుజలగా పథకం పేరు మార్చి వచ్చీరాగానే 20 లీటర్ల తాగునీటిని రూ.5కు పెంచేశారు. కనీసం ఆ అయిదు రూపాయలకైనా నీటిని పట్టుకుని వాడుకుందామంటే ముందుగా ఆర్డీయూలు, తర్వాత మదర్ ప్లాంట్లు మూతపడుతూ వచ్చాయి. చివరకు కుప్పం పట్టణంలో రెండుమూడు చోట్ల, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ కలిపి ఒక పదీ పన్నెండు చోట్ల మాత్రమే ఆర్డీయూలు పనిచేశాయి. అప్పటిదాకా వినియోగంలో ఉన్న మదర్ ప్లాంట్లలోని యంత్రాలు, ఆర్డీయూలు పనికిరాకుండా పోయాయి. మరోవైపు పనిలేకపోవడంతో ట్రాక్టర్లు, ట్యాంకర్లు డీకే పల్లె ఉద్యానవనానికి చేరి తుప్పు పట్టాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం ఈ విధంగా నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు ఎన్టీఆర్ సుజలతో మూతపడ్డ ప్రైవేటు శుద్ధ జల ప్లాంట్లు తిరిగి పుంజుకున్నాయి. గత్యంతరం లేక ప్రజలు అత్యధిక ధరలు పెట్టి, ఆ ప్రైవేటు ప్లాంట్లనుంచే నీటిని కొనుగోలు చేయక తప్పలేదు.



కుప్పం మండలం మహ్మద్‌పురం సమీపంలో నిరుపయోగంగా మారిన ఆర్డీయూ

పునరుద్ధరణకు సాంకేతిక అడ్డంకి

మార్చి నెలలోనే వేసవి తీవ్రమవుతోంది. తాగునీటి ఎద్దడి పెరుగుతోంది. బోరు బావులు ఎండిపోతున్నాయి. నీటి సరఫరా సమస్య తలెత్తుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్టీఆర్ సుజలను పునరుద్ధరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారు. ఇందుకోసం రూ.10.27 కోట్ల నిధులు కూడా ప్రభుతం మంజూరు చేసింది. అయితే నిధులు సిద్ధంగా ఉన్నాసరే, పునరుద్ధరణ చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం వెనకాడుతోంది. ఏదో సాంకేతిక సమస్య ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈమధ్య జరిగిన విలేకరుల సమావేశంలో కడా పీడీ వికాస్ మర్మత్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల పథకం అమలుకోసం ఏడు సంవత్సరాల కాలపరిమితితో ఒప్పందం కుదర్చుకుందని అంటున్నారు. ఆ ఒప్పందం ఈ ఏడాది అక్టోబరు నెలతో పూర్తవుతుంది. అంతేకాక, సదరు ప్రైవేటు కంపెనీకి ఏవో బకాయిలు కూడా చెల్లించాల్సి ఉందని తెలిసింది అధికారులు బహిరంగంగా చెప్పకపోయినా ఈ సాంకేతిక సమస్యవల్లే ఎన్టీఆర్ సుజల పథకం పునరుద్ధరణ సత్వరం చేయలేకపోతున్నారని సమాచారం. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పురుషోత్తంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా త్వరలోనే ఎన్టీఆర్ సుజల పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు. ఇందుకోసం అవసరమైన నిధులను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందని తెలిపారు.



కళాశాల ఆవరణలో చిట్టీలు



ఇరుకు బెంచీలపై కూర్చొని పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఓసు.. వారు పరీక్షలు రాస్తున్నారు!

● ఎస్వీయూ దూరవిద్య పరీక్షల నిర్వహణ తీరిది

ఒకే బెంచీపై ఇద్దరు.. పైగా ఇరుకిరుకుగా కూర్చొని ఉన్న విద్యార్థులు. వీరిని చూస్తుంటే పాఠాలు వింటున్నట్లు ఉంది కదూ. కానే కాదు. అందరూ పరీక్షలు రాస్తున్నారు. ఇది ఎస్వీయూనివర్సిటీ దూరవిద్య కింద యూజీ, పీజీ, ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థుల కోసం చిత్తూరులోని ఎస్సీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం. మరోవైపు ఈ పరీక్ష కేంద్రం ఆవరణలో చిట్టీలు కూడా దర్శనమిచ్చాయి. మాస్ కాపీయింగ్ ఆరోపణలూ లేకపోలేదు. ఈనెల రెండో తేదీన మొదలైన పరీక్షలు 23వ తేదీవరకు ఇక్కడ జరుగుతాయి.



కళాశాల ఆవరణలో చిట్టీలు

పైకి పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెబుతున్నా.. లోపల పరిస్థితి ఇలా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్‌ను వివరణ కోరగా.. తమ కళాశాల విద్యార్థినులకు తరగతులు జరుగుతున్నాయని, అందువల్ల ఆడిటోరియంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జంబ్లింగ్ విధానం వల్ల ఒక్కో బెంచీపై ఇద్దరు విద్యార్థులను కూర్చోబెట్టామని తెలిపారు. ఇకనైనా ఈ పరీక్షల నిర్వహణపై ఎస్వీయూ దూరవిద్య అధికారులు దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురు అరెస్టు

● అవమాన భారంతో ఓ నిందితుడి ఆత్మహత్య

వి.కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా - తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని నాయకనేరి అటవీ ప్రాంతంలో వారం రోజుల క్రితం జరిగిన బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ డి. ప్రభాకర్, సీఐ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో కన్పించిన వారిని విచారించగా వారు బంగారం దోపిడీ కేసులో నిందితులుగా తేలడంతో అరెస్టు చేశామన్నారు. వారిలో తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్ సమీపంలోని కల్లిపేటకు చెందిన వేదాచలం(44), కుమరేశన్ (39), రంజిత్ (35), దీపన్ చక్రవర్తి (42), సూరవేల్ (48)వున్నారన్నారు.ఈ నెల 2వ తేది రాత్రి 8.45 గంటల ప్రాంతంలో కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన దీపక్ కుమార్ అనే మార్వాడి వద్ద పని చేసే చేతన్ కారులో బంగారం తీసుకెళ్తుండగా డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు అంతర్రాష్ట్ర ముఠా అడవిలో దారి కాచి కత్తులతో బెదిరించి కారులో ఉన్న బంగారాన్ని దోచుకెళ్ళిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ప్రధాన ముద్దాయిలైన కేజీఎఫ్‌కు చెందిన కాంగ్రెస్ నేత సయపాల్‌తో పాటు కారు డ్రైవర్ ముకరం, బాబు, షణ్ముగంలను అరెస్టు చేసి వారి వద్ద రూ. 3.2 కోట్ల విలువైన 3.5 కిలోల బంగారం కడ్డీలను రికవరీ చేశామన్నారు.తాజాగా ఐదుగురిని అరెస్టు చేశామని, మిగిలిన నలుగురి కోసం అన్వేషిస్తున్నామని డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. దోపిడీ కేసులో తాజాగా అరెస్టయిన నిందితులను పలమనేరు కోర్టుకు తరలిస్తుండగా వారి బంధువులు మాట్లాడేందుకు ఎగబడ్డారు. అయితే పోలీసులు వారిని వారించి నిందితులను కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుషియల్ రిమాండు విధించారు. దీంతో నిందితులను మదనపల్లె జైలుకు తరలించారు.



ఆత్మహత్య చేసుకున్న అప్పు(ఫైల్ ఫొటో)

స్నేహితుల వల్లే కేసులో ఇరుకున్నా

బంగారం దోపిడీ కేసులో ముద్దాయిల్లో ఒకడైన అప్పు (28) తన స్వగ్రామమైన తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్ సమీపంలోని గుండ్లపల్లె వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం గ్రామ స్తులు గమనించి సమాచారమివ్వడంతో కుటుంబ సభ్యులు అతని మృతదేహన్ని కిందకు దించారు. స్నేహితులు తనను సరదాగా తీసుకువెళ్ళి దోపిడీ కేసులో ఇరికించారని, తన చావుకు వారే కారణమంటూ అతని సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన ఆడియో బయటపడింది. తమ బిడ్డ మృతికి కారణమైన స్నేహితులపై చర్యలు తీసుకోవాలంటూ కుటుంబ సభ్యులు డిమాండు చేశారు. ఈ కేసులో 8వ ముద్దాయిగా ఉన్న అప్పు ఆత్మహత్య విషయాన్ని డీఎస్పీ ప్రభాకర్ వద్ద ప్రస్తావించగా అప్పు ఈ దోపిడీలో పాల్పంచుకున్నాడు కాబట్టే ముద్దాయిగా చేర్చామన్నారు. అతడి ఆత్మహత్యతో తమకు సంబంధం లేదన్నారు.



బంగారం దోపిడీ కేసులో నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

ఒంటిమిట్టకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు చిత్తూరు-2 డిపో నుంచి ఈనెల 11వ తేదీన ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీపీటీవో జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కరోజు టూర్ ప్యాకేజీ కింద వీరభద్ర స్వామి దేవాలయం (రాయచోటి), దేవుని గడప, పుష్పగిరి శివాలయం, సోమేశ్వర స్వామి దేవాలయం సందర్శించవచ్చన్నారు. చివరిగా సాయంత్రం ఒంటిమిట్ట రామాలయంలో జరగనున్న సీతారాముల కల్యాణాన్ని వీక్షించడంతో టూర్ పూర్తవుతుందని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు చిత్తూరు ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సు నడుపుతున్నట్లు తెలియజేశారు. రాను, పోను టికెట్టు ధర పెద్దలకు రూ.700, పిల్లలకు రూ.400 నిర్ణయించడం జరిగిందన్నారు. 50 సీట్లు కలిగిన ప్రత్యేక బస్సును కూడా బుక్ చేసుకోవచ్చని సూచించారు. టికెట్లు కావాల్సిన వారు 73828 78629, 90305 55198 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జిల్లాపై 'సిలిండరు' భారం నెలకు రూ.1.80 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర పెట్రోలియం సహజ వాయువులశాఖ సోమవారం అర్ధరాత్రి నుంచి పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో వినియోగదారులపై ఆర్థికభారం పడింది. చిత్తూరులో ప్రస్తుతం సిలిండర్ ధర రూ.837 ఉండగా, తాజా పెంపుతో రూ.887కు చేరింది. జిల్లాలో 6,87,336 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు సుమారు 12వేల సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు ఏజెన్సీల ప్రతినిధులు చెబుతున్నారు. సిలిండర్‌పై రూ.50 పెంపుతో రూ.6లక్షల వరకు అదనపు భారం పడనుంది. ఈ లెక్కన నెలకు రూ.1.80 కోట్ల వరకు భారం ఉంటుంది. ఒక్కసారిగా వంట గ్యాస్ ధర రూ.50 పెంచడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయాల్లో ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) :చిత్తూరు,పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయాల్లో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు.చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.మధ్యాహ్నం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జగన్మోహన్ సమావేశం నిర్వహిస్తారు.చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. అనంతరం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చిస్తారు.

వివాదాస్పద సీఐ వీఆర్‌కు

- తీవ్ర ఆరోపణలున్నా చర్యలు శూన్యం
- కొనసాగుతూ.....నే ఉన్న విచారణ
- ఉన్నతాధికారి అండతో సేఫ్ ప్లేస్‌లోకి

చిత్తూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని ఓ కీలక స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐని వీఆర్‌కు పంపిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో ఎస్ఐగా పనిచేసినప్పుడు ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో అటవీశాఖ అధికారులకు పట్టుబడి సుదీర్ఘ కాలం సస్పెండైన ఆయన ఇటీవల ఓ దొంగతనం కేసులో నిందితుడి నుంచి రూ.12.50 లక్షలు వసూలు చేసినట్లు బయటపడింది.రాయచోటి పోలీసుల విచారణలో నిందితుడే ఈ విషయం చెప్పేశాడు. బహిరంగంగా స్టేషనులోనే పనికో రేటు వసూలు చేయడంతో పాటు వ్యక్తికో న్యాయం చేస్తున్నట్లు ఈయనకు డిపార్ట్‌మెంటులో పేరుంది. వైసీపీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తారనే ఆరోపణలున్నాయి. ఇతన్ని బదిలీ చేయించాలని అధికార పార్టీ నాయకులు ప్రయత్నించినా.. ఓ ఉన్నతాధికారి ఇన్నాళ్లు కాపాడుతూ వచ్చారని సమాచారం.తన వెనుక ఉన్నతాధికారి ఉన్నారని ఆ సీఐ కూడా నిత్యం చెప్పుకుని చెలరేగిపోయేవారు. ఏ కేసునైనా గంటలు, రోజుల వ్యవధిలో చేధించే పోలీసులు ఈ సీఐ రూ.12.50 లక్షలు తీసుకున్నాడనే కేసును నెల రోజులుగా విచారిస్తూ..నే ఉన్నారు. విచారణ పూర్తి చేస్తే అతనిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఆ ఉన్నతాధికారి ఒకట్రెండు రోజుల్లో బదిలీ అవుతున్నారని, అందుకే తెలివిగా ఈ సీఐని సేఫ్‌గా వీఆర్‌కు పంపించి తప్పించారని చర్చ జరుగుతోంది. అతడి స్థానంలో కొత్తగా నియామకమైన మరో సీఐ కూడా ఉన్నతాధికారి మనిషేనని, గతంలో ఆయన పనిచేసిన చోట అక్కడి ఎమ్మెల్యే పెద్ద పోరాటమే చేసి అక్కడినుంచే పంపించేశారని సమాచారం.



ఎండలదెబ్బకు నిర్మానుష్యంగా కన్పిస్తున్న చిత్తూరు గాంధీ సర్కిల్

వేసవితాపం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవితాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.మంగళవారం తవణంపల్లె మండలంలో అత్యధికంగా 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.నగరిలో 39డిగ్రీలు, శ్రీరంగరాజపురంలో 38.3, చిత్తూరు , గుడిపాల మండలాల్లో 38.0, నింద్ర , పులిచెర్ల, రొంపిచెర్ల, సోమల మండలాల్లో 37.6, సదుంలో 37.4, గంగాధరనెల్లూరులో 36.9, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 36.8, పూతలపట్టు,వెదురుకుప్పం మండలాల్లో 36.7, చౌడేపల్లె, విజయపురం, పాలసముద్రం, ఐరాల, పెనుమూరు మండలాల్లో 36.6, బంగారుపాళ్యంలో 36.4, యాదమరిలో 36.2, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో 36, కుప్పంలో 35.6, బైరెడ్డిపల్లెలో 35.3, కార్వేటినగరంలో 34.9, వి.కోటలో 34.4, పుంగనూరులో 34.2, రామకుప్పంలో 34.1, పలమనేరులో 33.9 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రేమించలేదని ద్విచక్రవాహనానికి నిప్పు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇష్టపడ్డ యువతి ప్రేమించలేదని ఓ యువకుడు ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టుకున్న సంఘటన మంగళవారం పుంగనూరులో చోటు చేసుకుంది. మోదుగులపల్లె పంచాయతీ గాంధీపురానికి చెందిన గిరి(22) ఓ యువతిని ప్రేమించాలని వెంటపడుతున్నాడు. ఆమె నిరాకరించడంతో మూడు రోజుల క్రితం ఇంటి వద్దకు 10మందితో వెళ్లి గొడవ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.మళ్లీ మంగళవారం సాయంత్రం యువతి ఇంటి వద్దకు చేరుకుని ఆమెను బయటకు రావాలని కోరాడు.తనను ప్రేమించకపోతే తన ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టుకుంటానని బెదిరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ యువతి బయటకు రాకపోవడంతో తాను వచ్చిన ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టాడు. గ్రామస్తులు అక్కడకు చేరుకునే లోపు పారిపోవడంతో వారు మంటలను అదుపు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.అతడి వల్ల తమ కుమార్తెకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.



కాలిన ద్విచక్ర వాహనం

నచ్చే కథలు వస్తే మళ్లీ నటిస్తా



● హీరోయిన్ రంభ

'నచ్చే కథలు వస్తే తప్పకుండా మళ్లీ సినిమాల్లో నటిస్తా' అని క్లారిటీ ఇచ్చారు నటి రంభ. పెళ్లిరోజు సందర్భంగా భర్త ఇంద్రకుమార్ పద్మనాథన్‌తో కలిసి మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, వివాహమై 15 ఏళ్లైన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చామన్నారు. 'సినిమాల్లోనే పుట్టిపెరిగాం. సినిమానే జీవితం. మంచి పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తాను' అని రంభ చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రవిశాస్త్రి

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. క్రికెటర్ రవిశాస్త్రి, రేమాండ్స్ గ్రూప్స్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భారతీయ మాస్టర్ హ్యాండ్లూమ్ డిజైనర్ పద్మశ్రీ గజం అంజయ్య, ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ డీజీ వివేక్ శ్రీవాత్సవ ఉన్నారు.

గౌతమ్ హరి సింఘానియా, రవిశాస్త్రి ←




సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,503


తలనీలాలు సమర్పించినవారు : 23,941



- వైసీపీ హయాంలో మంజూరైన 65 వేల ఇళ్లలో పూర్తయింది 26 వేలే
- పునాదుల దశ దాటని 22 వేల ఇళ్లు
- 574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తి కాని వైనం
- ఎక్కడా కనిపించని మౌలిక వసతులు



ఊరందూరులో నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం



ఊరందూరు లే అవుట్‌లో ఎటు చూసినా అసంపూర్తిగా కనిపిస్తున్న పక్కా ఇళ్లు

పేదల సొంతింటి కల భగ్నం

జిల్లాలో వేలాది మంది పేదల సొంతింటి కలను గత వైసీపీ ప్రభుత్వం భగ్నం చేసింది. ఐదేళ్లలో సుమారు 65 వేల ఇళ్లు మంజూరు కాగా అందులో 26 వేలు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరో 22 వేలు పునాదుల దశ దాటలేదు. తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణం మొదలే కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 574 లే అవుట్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా కనీసం ఒక్కటంటే ఒక్కటీ పూర్తి కాలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో 2019-24 నడుమ పీఎం ఆవాస్ యోజన కింద 64,895 పక్కా ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదేళ్లు గడిచేటప్పటికి కేవలం 26,855 ఇళ్లు మాత్రమే దాదాపు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వాటిలో కూడా చాలావరకూ ఫినిషింగ్ పనులు పెండింగ్ ఉన్నాయి. కొన్నింటిలోనే లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. 8,952 ఇళ్ల నిర్మాణం అసలు మొదలే కాలేదు.

574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తికాని వైనం

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం 574 లే అవుట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి భూములు కేటాయించింది. అందులో 49,022 ఇళ్లు మంజూరు చేసింది. 7,843 ఇళ్ల నిర్మాణ పనులు మొదలే పెట్టలేదు. కేవలం 8,991 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. వందశాతం లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని లే అవుట్లు గ్రామాలకు మరీ దూరంగా, అనువుగాని చోట్ల కేటాయించడంతో లబ్ధిదారులు అడుగు కూడా పెట్టలేదు. ఆయాచోట్ల ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఏ లే అవుట్‌లోనూ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మట్టి రోడ్లు, అరకొర విద్యుత్ స్తంభాల ఏర్పాటు తప్ప ఇతర సదుపాయాలు కనిపించడం లేదు.



నీళ్ల లీకేజీతో బురదమయంగా మారిన రోడ్డు

జగన్ శంకుస్థాపన చేసిన లే అవుట్ తీరిలా..

పేదలందరికీ జగనన్న ఇళ్ల పథకాన్ని 2020 డిసెంబరు 28న అప్పటి సీఎం జగన్ శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలో ప్రారంభించారు. ఆ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ పేదల ఇళ్లకు ఊరందూరు వద్ద లే అవుట్‌కు శంకుస్థాపన చేశారు. 6,836 మందికి ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. కానీ 5,086 మందికే పట్టాలిచ్చారు. అందులో 3,428 మందికే పక్కా ఇళ్లు మంజూరు చేశారు. మౌఖిక ప్రకటన ఆచరణకు వచ్చేసరికి 3,200 ఇళ్లు తగ్గిపోయాయి. మంజూరైన వాటిలోనూ 2,642 ఇళ్ల నిర్మాణమే మొదలైంది. వాటిలో 746 మాత్రమే పూర్తయ్యాయి. ఆ లబ్ధిదారుల్లోనూ కొందరే నివాసం ఉంటున్నారు. మౌలిక సదుపాయాలు లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవు. కొన్ని వీధుల్లో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. జగన్ హామీ ఇచ్చిన శ్రీకాళహస్తి శాటిలైట్ టౌన్‌షిప్ దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం!



కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. అక్కడక్కడా పెట్టిన కొళాయిల నుంచీ తాగునీరు తెచ్చుకుంటున్నాం. తాగునీటి పైపులన్నీ పగిలిపోయి నీరంతా రోడ్లపైకి వస్తోంది. దాంతో మట్టి రోడ్లు బురదగా మారాయి. కాలనీలో కాపురాలు తక్కువ. ఎక్కడ చూసినా సగంలో ఆపేసిన ఇళ్లే. రాత్రయితే వాటిలోకి గంజాయి, మద్యం తాగేవారు వస్తున్నారు. ఆకతాయిల వల్ల రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం.

- గంగ, జగనన్న కాలనీ, ఊరందూరు



గూడూరు: రామలింగయ్య కాలనీ

గూడూరు మున్సిపాలిటీ రామలింగయ్య కాలనీలోని జగనన్న లే అవుట్‌లో 202 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. 57 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. 65 పునాదుల దశలో ఆగిపోయాయి. మరో 83 బేస్‌మెంట్ దాటి వివిధ దశల్లో నిలిచిపోయాయి. మిగిలిన 71 అసలు పనులే మొదలు కాలేదు. సిమెంటు రోడ్లు, కాలువలు కనిపించవు. మొండిగోడలు, పునాదులకే పరిమితమైన ఇళ్లతో కాలనీ శిథిల వాటికలా కనిపిస్తోంది.

ముళ్లకంపల మధ్య కాపురముంటున్నాం!



చెన్నూరు రామలింగయ్య కాలనీ గూడూరు మున్సిపాలిటీలో ఉందన్న మాటే గానీ సౌకర్యాలూ లేవు. వర్షాకాలంలో మట్టి రోడ్లన్నీ బురదతో నిండిపోతున్నాయి. ఏ వీధిలో చూసినా ముళ్ల కంపలు, పొదలే. వాటి మధ్యే నివాసాలుంటున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోలేదు. స్థోమత లేని చాలా మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక మధ్యలోనే వదిలిపెట్టేశారు.

- జిలానీ బాషా, రామలింగయ్య కాలనీ

బ్యాండ్‌పాలెంలో స్థలాలు చూపని వైనం

వెంకటగిరి మండలం సోమసానిపల్లి పంచాయతీ బ్యాండ్‌పాలెంలోని 18 మంది పేదలకు గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు.. ఇళ్లూ మంజూరు చేసింది. ఆ స్థలాలు ఎక్కడనేది మాత్రం చూపలేదు. అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన లబ్ధిదారులు ఆశలు వదిలేసుకున్నారు.

'చెన్నేరి'.. చేదు నిజాలు

సత్యవేడు మండలం చెన్నేరిలో 53 మంది పేదలకు గత వైసీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయారు. కాలనీలో 53 ఇళ్లకు గానూ ఒక్కటీ పూర్తి కాలేదు.

సత్యవేడు జగనన్న కాలనీది అదే కథ!

సత్యవేడులోని 350 మంది నిరుపేదలకు గత ప్రభుత్వం పట్టాలు.. ఇళ్లు మంజూరు చేసింది.అందులో200 మంది పనులు మొదలు పెట్టారు. ఐదేళ్లలో కేవలం 50 మాత్రమే పూర్త య్యాయి. వివిధ దశల్లో 150 నిలిచిపోగా మరో 150 ఇంతవరకూ మొదలే కాలేదు.



చిట్టడవిలా మారిన మంగళంపాడు జగనన్న లే అవుట్

మంగళంపాడులో అడుగుపెట్టని లబ్ధిదారులు

సూళ్లూరుపేట మండలం మంగళంపాడులోని ఎస్సీ పేదల కోసం గత ప్రభుత్వం కిలోమీటరు దూరంలో లేఅవుట్ ఏర్పాటు చేసింది. 44 మందికి పట్టాలు మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి మౌలిక వసతులూ ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఆ లేఅవుట్‌లో ఇంతవరకూ అడుగు కూడా పెట్టలేదు. ముళ్లకంపలు, పొదలూ పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తోంది.

గిరిజనులకు మిగిలింది గుడిసెలే!

సూళ్లూరుపేట మండలం మంగళంపాడు ఆత్రేయ గ్రామానికి చెందిన గిరిజనుల కోసం గత ప్రభుత్వం జగనన్న ఇళ్ల పథకం కింద కాలనీ మంజూరు చేసింది. గ్రామానికి చేరువలో లే అవుట్ ఏర్పాటు చేయాలని భూమి కేటాయించింది. 33 మందికి పట్టాలు మంజూరు చేశారు. అయితే ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం అదే లే అవుట్‌లో లబ్ధిదారులైన గిరిజనులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు.



రేకుల షెడ్డు వేసుకున్న లబ్ధిదారు



సూళ్లూరుపేట మండలం కేసీఎన్ గుంట పంచాయతీ దావాదిగుంట గ్రామంలో 13 మంది పేద ఎస్సీలకు పక్కా ఇళ్లు మంజూరు చేసింది గత ప్రభుత్వం. అంతా నిరుపేదలు కావడంతో పది మంది నిర్మాణాల జోలికే పోలేదు. ఇద్దరు మాత్రమే స్లాబ్ దాకా పనులు పూర్తి చేసి ఫినిషింగ్ చేయలేక వదిలిపెట్టేశారు.ఓ లబ్ధిదారుడు తనకు కేటాయించిన స్థలంలో రేకులతో తాత్కాలికంగా షెడ్డు వేసుకుని నివాసముంటున్నాడు.



తిరుపతి పేదలకూ తప్పని నిరాశ


తిరుపతి నగర పరిధిలోని పేదలకు ఏర్పేడు, చంద్రగిరి, వడమాలపేట, రేణిగుంట మండలాల్లో ఆరు లే అవుట్లు మంజూరు చేసింది. రేణిగుంట మండలం జీపాలెం గ్రామంలో 34 ఎకరాల లే అవుట్‌లో 1,753 పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికీ పది శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. ఎలాంటి సదుపాయాలూ కల్పించలేదు.

రేణిగుంట జీపాలెంలో ఇళ్ల పరిస్థితి



ఒకరి మృతికి కారణమైన నిందితుడి అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం కోటంబేడుకు చెందిన తాడి వెంకటరమణయ్య మృతికి కారణమైన కొండా శివయ్యని అరెస్టు చేసినట్లు సీఐ రమణ తెలిపారు. వెంకటగిరి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. గత నెల 30వ తేదీన తాడి వెంకటరమణయ్య, కొండా శివయ్య వేటకు వెళ్లారు. తిరిగి మోటర్ సైకిల్‌పై వస్తుండగా నాటు తుపాకీ పేలడంతో వెంకటరమణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. శివయ్య భయంతో పక్కనే ఉన్న కాలువలో మృతదేహాన్ని పడేశాడు. మృతదేహం నీళ్లలో తేలుతుండడంతో కాలువలో నుంచి బయటకు లాగి పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిపోయాడు. అప్పట్నుంచి తప్పించుకుని తిరుగుతున్న శివయ్యను మంగళవారం అరెస్టు చేశామని, ఆయన వద్ద ఒక నాటు తుపాకీ, 114 గ్రాముల నల్లమందు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నిందితుడిని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి ఎస్ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.



దైవచింతన పెంపొందించుకోవాలి

● కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన పెంపొందించుకోవాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అన్నారు. రామచంద్రాపురం మండలం కుప్పంబాదురు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయనకు ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీ శిష్య బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ ప్రాంగణంలో మొక్కను నాటి నీరు పోశారు. ఎన్టీఆర్ ట్రస్టు నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారు. స్వామిజీ ఆశ్రమంలో సీతారామ సమేత రామలక్ష్మణ, హనుమంత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీను షా (ఫైల్ ఫొటో)

తిరుమలలో తమిళనాడువాసి అదృశ్యం

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల వచ్చిన తమిళనాడు భక్తుడు కనిపించకుండాపోయాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నైకు చెందిన ఆర్ శ్రీను షా(53) ఈనెల 5న శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అన్నప్రసాదాలు స్వీకరించాక చెప్పులు వేసుకుని వస్తాని వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతని సోదరుడు కుబేర్ షా తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు తెలిసిన వారు 9440796769 నంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

సదరన్ డిస్కం కాంట్రాక్టు కార్మికుల దీక్ష విరమణ

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం 15 రోజులుగా డిస్కం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు సానుకూలంగా స్పందించారు. సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన మహాధర్నా సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం సీఎండీతో చర్చలు ఏర్పాటు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు, వేతనాలు పెంపు, ఇతర అంశాలను సీఎండీ దృష్టికి తెచ్చారు. తమ పరిధిలో వున్న సమ్యలను పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. దీంతో రిలే దీక్షలను బుధవారం విరమించుకున్నామని సంఘం నాయకులు కుమార్ తెలిపారు. అధికారులు డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పఠాన్ అయూబ్ ఖాన్, సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవి, కార్మిక సంఘాల నాయకులు శివప్రసాద్ రెడ్డి, రవికుమార్, జలీల్‌బాషా, హుసేన్‌పీరాం పాల్గొన్నారు.



సీఎండీతో చర్చలు జరుపుతున్న సీఐటీయూ నాయకులు

జాతీయ స్థాయి పోలీసు బ్యాడ్మింటన్ పోటీలకు తిరుమల కానిస్టేబుల్ ఎంపిక



వాసుదేవ రావు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేరళలో ఈ నెల 11 నుంచి 15వ తేది వరకు జరగనున్న ఆలిండియా పోలీసు బ్యాడ్మింటన్ పోటీలకు తిరుమల వన్‌టౌన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వాసుదేవ రావు ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన.. కానిస్టేబుల్‌గా తిరుపతి జిల్లాలో నియమితులయ్యారు. తొలినుంచీ ఆటలపై ఈయనకు ఆసక్తి ఉంది. గత ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు విజయవాడలో జరిగిన పోలీసు బ్యాడ్మింటన్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొని సింగిల్స్ విభాగంలో ప్రతిభ చూపారు. ఈ క్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈయనకు జిల్లా పోలీసు శాఖ అభినందనలు తెలిపింది.

సినీనటుడు సప్తగిరికి మాతృ వియోగం



తిరుచానూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ తిరుమలనగర్ వీధిలోని నివాసం వద్దకు ఆమె భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సప్తగిరి 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేశారు.

హథీరాంజీ మఠం భవనంపై 20లోపు చర్యలు తీసుకోవాలి!

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హథీరాంజి మఠం భవనంపై ఈనెల 20వ తేదీ లోపు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మఠం భవనం శిథిలావస్థకు చేరుకున్న దుస్థితిపై మంత్రి చర్చించినట్లు సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి ఈ అంశం వెళ్లిన నేపథ్యంలో భవనం ప్రమాదం జరగకముందే ఈనెల 20 లోపు సమన్వయ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

చిత్తూరు టౌన్ బ్యాంక్ గత పాలకవర్గ సభ్యులకు సర్‌ఛార్జీల నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకుకు గత ప్రభుత్వ హయాంలో నియమింపబడ్డ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులందాయి. దానిపై విచారణ జరిపి, నిజమేనని తేలడంతో దుర్వినియోగమైన రూ.13.68లక్షల రికవరీ కోసం సహకారశాఖ అధికారులు సభ్యులకు సర్‌చార్జి నోటీసులు జారీచేశారు. డబ్బులు కట్టకుంటే వారి ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం ఎగ్జిక్యూటివ్ పిటీషన్లు దాఖలు చేసేందుకు సిఫార్సు చేశారు. బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు అప్పట్లో జరగకపోవడంతో వైసీపీ ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించింది.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ కమిటీ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. అప్పట్నుంచి బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీగా డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణమ్మ వ్యవహరిస్తున్నారు. గత పాలకవర్గం అవినీతికి పాల్పడిందని, వాటిపై విచారణ జరిపి వడ్డీతో సహా వసూలు చేయాలని కొందరు బ్యాంకు ఉద్యోగులు చిత్తూరు డీఎల్సీవో వనజకు ఫిర్యాదుచేశారు. దాంతో ఆమె నియమించిన విచారణాధికారి సమగ్ర విచారణ జరిపి అప్పటి పాలకవర్గం అవకతవకలకు పాల్పడ్డ విషయం నిజమేనని తేల్చింది. దాంతో పాలకవర్గ సభ్యులనుంచి రూ.13.68 లక్షలు వసూలు చేయాలని తీర్మానిం

ఈపీ దాఖలుకు సిఫార్సు

చారు. అప్పటి బోర్డు చైర్మన్ రామ్‌గణేష్ నిబంధనలకు విరుద్ధంగా నెలవారీ గౌరవ వేతనం రూపేణా రూ.5,47,568 తీసుకున్నట్లు తేలింది. అయితే తన తప్పును గుర్తించిన రామ్‌గణేష్ ఇటీవల ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు చెల్లించారు. అయితే దానిపై వడ్డీరూపేణా చెల్లించాల్సిన రూ.63వేల బకాయి ఉన్నట్లు అధికారులు తేల్చారు. నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు ఐటీ విభాగంలో ఉపేంద్ర, కమల్‌నాథ్ అనే ఇద్దరిని ఉన్నత అధికారుల అనుమతి లేకుండా గత పాలకవర్గం నియమించింది. ఇందుకోసం వారికి జీతాల రూపేణా చెల్లించిన రూ.6.24 లక్షలు వెనక్కి తీసుకోవాలని నివేదికలో విచారణ అధికారి సిఫార్సు చేశారు. వారిద్దరినీ తొలగించాల్సివుండగా ఓ ఉద్యోగి గైర్హాజరు కాగా, మరో ఉద్యోగిని గత నెల చివరలో నిలిపివేశారు. ఉద్యోగులకు జీతాలుగా చెల్లించిన రూ.6.24 లక్షలను బ్యాంకు చైర్మన్ రామ్‌గణేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులు దీనదయాల్, వెంకటేష్, తంగరాజ్, అస్లాం హుస్సేన్‌ల నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అప్పటి బ్యాంకు సీఈవో శ్రీనివాస్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే తన నెలవారీ జీతాన్ని రూ.30 వేల నుంచి



చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్

రూ.50 వేలకు పెంచి తీసుకున్నట్లు గుర్తించారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు రెండేళ్ళ కాలపరిమితితో తీసుకున్న రూ.5 లక్షలను బ్యాంకు ఐదుగురు పాలకవర్గ సభ్యులతో పాటు అప్పటి సీఈవో శ్రీనివాసులు నుంచి ఈ మొత్తాన్ని రికవరి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.గత పాలకవర్గ హయాంలో సర్వసభ్య సమావేశాలు జరిగిన సందర్భంగా డిపాజిటర్లు, షేర్ హోల్డర్లకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లాస్కులు, బ్యాగులు పంచిపెట్టారు. ఇందుకోసం బ్యాంకు నిధుల నుంచి ఖర్చుచేసిన రూ.1.80 లక్షలను గత పాలకవర్గ సభ్యులనుంచి వసూలు చేయాలని తేల్చారు. దుర్వినియోగమైనట్లు తేల్చిన రూ.13.68 లక్షలను బ్యాంకు పాలకవర్గం, సీఈవో బ్యాంకుకు చెల్లించాలని, లేకుంటే వారిపై సహకార చట్టం కింద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సహకారశాఖ అధికారులు వారికి సర్‌చార్జి నోటీసులు జారీచేశారు. ఒకవేళ బకాయిలు చెల్లించకుంటే వారి ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం ఈపీలు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని బ్యాంకు పీఏసీ నారాయణమ్మ తెలిపారు.

వాయిదా మీరిన మొత్తాలు రూ.47.32 కోట్లు

అప్పు వసూళ్లకోసం 1568 ఈపీలు దాఖలు

● డీసీసీబీ ఓఎస్డీ నారాయణమ్మ



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో గత ఏడాదికి జిల్లా సహకార కేంద్రబ్యాంకు(డీసీసీబీ) బ్రాంచ్‌లు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోలు) ద్వారా వ్యవసాయం, ఇతరత్రా కారణాలతో తీసుకున్న రుణాలు రూ.47.32 కోట్లు నిర్దిష్ట గడువులోగా చెల్లించని రుణగ్రహీతలపై రికవరి కోసం 1568 ఎగ్జిక్యూటివ్ పిటీషన్లు (ఈపీ)లు దాఖలు చేసినట్లు డిప్యూటీ రిజిస్ట్రార్, ఆ బ్యాంకు ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఎస్ఎంఎం నారాయణమ్మ తెలిపారు.వ్యవసాయ, వ్యవసాయేతర పనుల కోసం బ్రాంచ్‌లు, సింగిల్ విండోల ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక, స్వల్పకాలికేతర పద్దులకింద రైతాంగానికి డీసీసీబీ రుణాలను పంపిణీ చేస్తోందన్నారు. అయితే వాటిని నిర్దిష్ట గడువులోగా చెల్లించకపోవడంతో వాయిదా మీరిన అప్పులను చెల్లించాలని రుణగ్రహీతలకు సర్ఫార్జీల నోటీసులు జారీచేశామన్నారు. అయినా వాటికి స్పందించని కారణంగా చివరి అస్త్రంగా ఆస్తుల వేలంకోసం ఈపీ దాఖలు అనివార్యమైందని చెప్పారు. బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా రూ.30.54 కోట్ల రికవరీ కోసం రూ.969 ఈపీలు, సింగిల్ విండోల ద్వారా తీసుకున్న రూ.16.78 కోట్లు రాబట్టేందుకు 599 ఈపీలు దాఖలు చేశామని తెలిపారు. వీటిలో ఏడాది గడువు కల్గిన రూ.37.27 కోట్ల కోసం 872 ఈపీలు, 1-3 సంవత్సరాల మధ్య గడువు కల్గి బకాయి వున్న రూ.4.29 కోట్లు రాబట్టేందుకు 145 ఈపీలు, 3-6 సంవత్సరాల మధ్య గడువు కల్గి వాయిదా మీరిన రూ.1.65 కోట్ల వసూళ్ల కోసం 45 ఈపీలు, ఆరేళ్లకు మించి గడువు కల్గి, వాయిదా మీరిన రూ.7.09 కోట్ల రికవరీ కోసం 506 ఈపీలు దాఖలయ్యాయన్నారు. ఓవర్ డ్యూ అయిన రూ.12.54 లక్షలకు సంబంధించి మూడు ఆర్బిట్రేషన్ కేసులు నమోదు చేశామని ఆమె వివరించారు. బకాయిలు చెల్లించని రుణగ్రహీతలపై చట్టపర చర్యలు చేపట్టి రుణవసూళ్ల కోసం ఆస్తుల జప్తునకు వేలం నిర్వహించేందుకు సేల్ ఆఫీసర్ల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే 17 కేసులకు సంబంధించి రుణగ్రహీతలు రూ.70 లక్షలు చెల్లించగా, వారిపై మోపిన ఈపీలను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఏప్రిల్ నెల నుంచి ప్రతినెలా ఆర్బిట్రేషన్, హియరింగ్, నోటీసుల జారీ, ఎగ్జిక్యూటివ్ పిటీషన్లు దాఖలు, ప్రాపర్టీ అటాచ్మెంట్‌వారీగా న్యాయపరంగా రుణగ్రహీతలపై తీసుకుంటున్న చర్యలపై నెలవారి నివేదికలు అందించాలని ఆప్కాబ్ సోమవారం సర్క్యులర్ జారీ చేసిందని నారాయణమ్మ చెప్పారు.

'స్వర్ణాంధ్ర'పై ప్రణాళికలు రూపొందించండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నియోజకవర్గాలవారీగా కార్యాచరణ ప్రణాళికలు మే 31వ తేదీలోగా సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అధికారులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారులకు మండల, సచివాలయ స్థాయి అధికారులు సహకరించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన డాక్యుమెంట్‌ను తయారుచేయాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి (పీఆర్), విజయ్ కుమార్ (ఆర్‌డబ్ల్యూఎస్), డీఆర్డీఏ, డ్వామా పీడీలు శ్రీదేవి, రవికుమార్, ఎల్డీఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. విద్యుత్ వాడకం క్రమంగా పెరుగుతోందని, ఓవర్‌లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఏఈలు అప్రమత్తంగా ఉంటూ.. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్క్ ఆర్డర్లు పెండింగ్ ఉన్న ఏఈలు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. లేదంటే జరిమానా కింద వారి జీతాల నుంచి రికవరీ ఉంటుందని హెచ్చరించారు. అలాగే వంద శాతం విద్యుత్ బిల్లులను వసూలు చేయాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ మునిచంద్ర, డీఈలు ఆనంద్, ప్రసాద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై దృష్టి పెట్టండి : డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని డీఆర్వో మోహన్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రతిభావంతుల సంక్షేమానికి గతంలో ఉన్న చట్టాలను కేంద్రం ఇటీవల సవరించిందని చెప్పారు. సవరించిన చట్టాలను అనుసరిస్తూ ప్రతి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంపుల ఏర్పాటు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచడం, సబ్సిడీ రుణాల మంజూర్లలో ప్రాధాన్యమివ్వడం, కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయడం తదితరాలను సభ్యులు డీఆర్వో దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఎంహెచ్‌వో సుధారాణి, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తాం

వెదురుకుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ స్పష్టం చేశారు. మంగళవారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలసముద్రంలోనూ త్వరలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు. ఇకపై ప్రతి పంచాయతీకి వస్తామన్నారు. పల్లెనిద్రకు వచ్చినప్పుడు సమస్యలు గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం అన్నట్లు పనిచేస్తున్నారన్నారు. ఎంపీతో కలిసి గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని అని విభాగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ.. అవసరమైతే సమస్యలను మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యం

టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకుడికీ ప్రాధాన్యం ఇస్తామని థామస్ భరోసా ఇచ్చారు. మంగళవారం వెదురుకుప్పంలో కార్యకర్తే అధినేత కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. పార్టీలో ఉంటూ ద్రోహం చేసే వారిని క్షమించబోనని హెచ్చరించారు. నియోజకవర్గంలో రెండు వేల ఎకరాల్లో పరిశ్రమ హబ్ తీసుకొస్తామని, దానికి సీఎం చంద్రబాబు అంగీకరించారని చెప్పారు. పచ్చికాపల్లం నుంచి కొత్తపల్లిమిట్ట వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేయిస్తామన్నారు. ఆగిపోయిన ఐటీఐ పనులు పూర్తి చేయిస్తామని, త్వరలోనే వెదురుకుప్పంలో రూ.5కోట్లతో మినీ స్టేడియం నిర్మాణ పనులు జరుగుతాయని తెలిపారు. వెదురుకుప్పంకు పీహెచ్‌సీ మంజూరుకు కృషి చేస్తామన్నారు. వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చడానికి కృషి చేస్తామన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎంపీ ప్రసాదరావు, బాధితుడితో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్



ధ్వంసమైన బోరు పైపులను పరిశీలిస్తున్న రైతులు

పంటపొలాల్లో ఏనుగుల హల్‌చల్

కల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంట పొలాల్లో ఏనుగుల మంద హల్‌చల్ చేస్తున్నాయి. మండలంలోని ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లి వద్ద రెండోరోజు సోమవారం రాత్రి పంటలపై గజదాడులు కొనసాగించాయి. దిగుమూర్తివారిపల్లిలోని రైతులు వీరరాఘవులునాయుడు, ఈశ్వర్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, జయచంద్రనాయుడు, సురేంద్రలకు చెందిన పంటలను, బోరు మోటార్లు, నీటి పైపులలను ధ్వంసం చేశాయి. అనంతరం వచ్చిన మార్గంలోనే ఏనుగుల గుంపు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. పంటలను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో కృష్ణమూర్తి పరిశీలించారు.

నిధుల దుర్వినియోగంపై డీఎస్పీకి ఫిర్యాదు

పుంగనూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘ సభ్యుల నిధులను ఆర్పీ దుర్వినియోగం చేసినట్లు సంఘ సభ్యులు డీఎస్పీ ప్రభాకర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు.పుంగనూరు పట్టణం 17వ వార్డులోని వైభవలక్ష్మి స్లమ్ సమాఖ్య గ్రూపులో దాదాపు 280 మంది సభ్యులుండగా ఆర్పీ రెడ్డిరాణి రూ.32,10,660 పొదుపు, వడ్డీ రుణాలను స్వాహా చేసినట్లు 2024 నవంబరులో జరిగిన ఆడిట్‌తో బయటపడినట్లు వాపోయారు. అప్పటి మెప్మా పీవో మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో వసూలు చేస్తామని చెప్పారన్నారు. ఆర్పీని నిలదీయడంతో గత ఏడాది డిసెంబర్‌లో పూర్తిగా చెల్లిస్తామని అగ్రిమెంట్ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు స్పందించకపోవడంతో ప్రస్తుత మెప్మాపీవో హరినాథ్ రెడ్డి, సీవో మాధవిల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.



పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఎస్వీసెట్‌లో నేడు అర్జున్ సన్నాఫ్ వైజయంతి ఆడియో లాంచ్

పూతలపట్టు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పూతలపట్టు సమీపంలోని ఎస్వీసెట్ కళాశాలలో అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్నట్లు చైర్మన్ రావూరి వెంకటస్వామి, వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్ తెలిపారు.హీరో కల్యాణ్ రామ్, సీనియర్ నటి విజయశాంతి తోపాటు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ తదితరులు పాల్గొంటారన్నారు.

వార్షిక పరీక్షల్లో 'వేము' విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు

పూతలపట్టు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ప్రతిభ చాటారని నిర్వాహకులు తెలిపారు. 41 మంది బీటెక్ విద్యార్థులు, 14 మంది డిప్లొమా విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 90శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. వీరిలో బీటెక్ చదువుతున్న లక్ష్మీప్రియ ప్రథమ స్థానం, ప్రియ ద్వితీయ స్థానం సాధించారు. డిప్లొమాలో జైబాహారాజ్, మానసలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ నవీన్ కిలారిలు అభినందించారు.

చిత్తూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్‌కు అస్వస్థత

చిత్తూరురూరల్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ బస్టేషన్ మేనేజర్ రవీంద్ర అస్వస్థతకు గురయ్యాడు. కొన్ని రోజులుగా బస్టాండులోని మరుగుదొడ్లు శుభ్రంగా లేవని డీపీటీవో జగదీష్‌కు ఫిర్యాదు అందుతున్నాయి. దాంతో శుభ్రం చేయించాలని రవీంద్రను ఆయన ఆదేశించారు. అయినా శుభ్రం చేయించక పోవడంతో మంగళవారం రవీంద్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒత్తిడికి గురైన ఆయన హైబీపీకి లోనై కిందపడిపోయాడు. వెంటనే పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

మహేశ్వరయ్య మామూలోడు కాదు!

● ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు
● ఏకకాలంలో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు
● రూ.85 కోట్ల ఆస్తులను గుర్తించిన అధికారులు
● చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడి.. సస్పెండైన వైనం

పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం. బంగారం, వెండి, చర, స్థిరాస్తులేమో రూ.85 కోట్లకుపైగా ఉన్నట్లు అంచనా. ఇలా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారంటూ ఆయనపై ఫిర్యాదులొచ్చాయి. దీంతో చంద్రగిరి పంచాయతీ పూర్వ కార్యదర్శి మహేశ్వరయ్య ఇంటితో పాటు ఐదుచోట్ల ఏకకాలంగా ఏసీబీ తనిఖీలు చేపట్టింది. రూ.కోట్ల ఆస్తులకు సంబంధించి పత్రాలను అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



పేరూరులోని ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు



మహేశ్వరయ్య


అప్పుడు లంచం తీసుకుంటూ..

ఇటీవల చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహేశ్వరయ్య.. కుప్పం, పలమనేరు, పుంగనూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. పనిచేసిన ప్రతిచోటా ఆయనపై ఆరోపణలు రావడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక ప్రజా ప్రతినిధి అండదండలతో చంద్రగిరికి వచ్చిన ఆయన నాలుగేళ్లలో వారి కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా సంపాదించారన్న విమర్శలున్నాయి. పంచాయతీలో ఏ పని కావాలన్నా.. బిల్లులు మంజూరు కావాలన్నా.. తనకేంటని అడగతారనే ఆరోపణలు వచ్చాయి. ఆ క్రమంలో చిన్నగొట్టిగల్లుకు చెందిన దినేష్‌రెడ్డి సచివాలయ భవనం నిర్మించారు. దీనికి బిల్లులు మంజూరు చేయడానికి దాదాపు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు సమాచారం. అంత ఇచ్చుకోలేక దినేష్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆ తర్వాత మహేశ్వరయ్యకు దినేష్‌రెడ్డి రూ.50 వేలు లంచంగా ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో.. ప్రభుత్వం ఆయన్ను సస్పెండు చేసింది. ఇప్పుడాయన బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఇప్పుడు ఆదాయానికి మించి ఆస్తులున్నాయని..

తాజాగా.. మహేశ్వరయ్యకు ఆదాయానికి మించిన ఆస్తులున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సామాన్య కుటుంబంలో పుట్టిన ఈయన అనతికాలంలోనే రూ.కోట్ల ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. తిరుపతి, కడప జిల్లాలకు చెందిన ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు, చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరు, హైదరాబాదులో ఏక కాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. పేరూరులోని ఆయన ఇంటి నుంచి కిలో బంగారం, వెండి వస్తువులు, దాదాపు రూ.మూడు లక్షల నగదు, రూ.35 లక్షల విలువ చేసే బ్యాంకు టర్మ్ డిపాజిట్లు, రెండు కార్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పేరూరులో దాదాపు రూ.ఐదారు కోట్ల విలువైన ప్లాట్లు ఉన్నాయి. దాదాపు రూ.85 కోట్ల చర, స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. మహేశ్వరయ్య కూడబెట్టిన అక్రమాస్తుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం బినామీల పేరిట పెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. ప్రధానంగా బెంగళూరులో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే అపార్టుమెంటు ఉన్నట్లు.. పేరూరులోని ఆయన ఇంటి వద్ద డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. పలమనేరులో మూడంతస్థుల ఇల్లు, ఒక ఫాం హౌస్ ఉంది. గంగవరంలో ప్లాట్లు, ఒక ఇల్లు ఉన్నాయి. బద్వేలులోనూ వివిధ పేర్లతో ఆస్తులు కూడబెట్టినట్లు తెలిసింది. అక్కడ కొన్ని కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి అత్త, మామ ఇంట్లో సోదాలు చేస్తున్న తనిఖీ బృందాలు కొన్ని విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంగవరంలో వ్యవసాయ భూములు ఉన్నట్లు రికార్డుల ద్వారా బయటపడింది. వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు, లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటికోసం ఆయా బ్యాంకుల మేనేజర్లకు లేఖలు రాయనున్నట్లు తెలిసింది.

గంగవరం ఫాంహౌస్‌లో తనిఖీలు



గంగవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం కూర్నిపల్లె సమీపంలోని మహేశ్వరయ్యకు చెందిన మామిడి తోపు, ఫాంహౌస్‌లో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫాంహౌస్‌లోని గదులు, ప్లైవుడ్ ర్యాక్స్ పలు ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏవైనా రికార్డులు లభించాయా లేదా అన్నది వెల్లడించలేదు. తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామని అధికారులు చెప్పారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

దారిపోయినది

ఇంటర్ మార్క్స్ మెమో No. TV20009731, No.TV60009671, పి.హాసిని, D/o పి.మహేష్, డో.నెం. 2-52, కె.వి.ఎస్.వీధి, పాతపేట, పలమనేరు పేరుగల సర్టిఫికెట్స్ దారిపోయినవి. ఎవరికైనా దొరికిన పై అడ్రస్‌కు తెలుపగలరు. సెల్ : 99636 36644.

AJT - 200955

WANTED

Wanted STEPS TI, APSACS ప్రాజెక్ట్, నగరి వీధి, శ్రీకాళహస్తి నందు పనిచేయుటకు ANM కావలెను. (Q) MPHW steps.srkl@gmail.com పంపగలరు. సంప్ర.: 93900 28595, 79897 27460

AJT - 1126

COMPUTER EDUCATION

FREE Courses: DCA, DTP, MS-OFFICE (Lab Fee Only), PAID Courses: DCA, PGDCA, DTP, TALLY, MS-OFFICE, Spoken English Etc. Cont : SSCT, 663, Bhavani Nagar, Tirupati, 94407 06077.

AJT - 1127

CHANGE OF NAME

I, Sodanapalli Rafi (Old Name) S/o Sodanapalli Hasan Saheb, R/o 4-86-A, Indirapuram, Angallu, Annamayya Dist. AP-517325. I changed my Name to SODANAPALLI MAHABOOB BASHA (New Name) S/o SODANAPALLI HASAN SAHEB. Henceforth I will be known as SODANAPALLI MAHABOOB BASHA (New Name).

AJT - 1133

PLOTS FOR SLAE

6 లక్షలకే తిరుపతి IIT, IISER విద్యా సంస్థల ప్రక్కన ఫైనల్ అప్రూవ్డ్‌తో ప్లాట్లు డైరెక్ట్ ఓనర్ స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 95027 74175 / 79959 92114.

AJT - 1135

ఎర్త్ అండ్ మూవర్స్

పాత భవనాలను, బిల్డింగ్‌లను కొట్టి సైట్ క్లియర్ చేసి సెల్లార్ గుంతలు, పిల్లర్ గుంతలు ఎత్తి ఇవ్వబడును. మరియు సిమెంట్ రోడ్డు బ్రేకింగ్ చేయబడును. సంప్ర. : 86109 26629, 91216 62024

AJT - 200795

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 227128

CHANGE OF NAME

I, Syed Kalet Basha (Old Name) S/o Syed Akbar Basha, R/o 3/73, Turukapalli, Mukkavaripalli, Obulavaripalli, Annamayya Dist. AP- 516108. I have changed my Name to SYED KHALID (New Name) S/o SYED AKBAR BASHA Henceforth I will be known as SYED KHALID (New Name).

AJT - 1134

CHANGE OF NAME

I, D.Dhanavi S/o D.Nehru (Old Name) D.No:1, B-Type, Vinayaka Nagar Quarters, ISKCON Temple, Tirupati Urban Mandal, Tirupati Dist., Andhra Pradesh, 517501. Do here by declared I have changed my Name as DHANAVATH DHANVIRAJ, S/o DHANAVATH NEHRU (New Name).

AJT - 1132

వివాహ పరిచయవేదిక

వివాహ పరిచయ వేదిక 13-4-2025వ తేది, ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 PM వరకు రాయల బలిజ సంక్షేమ సంఘం, పద్మావతి వివాహ పరిచయ వేదిక. AGK బిల్డింగ్, గాంధీ రోడ్డు, తిరుపతి నందు ఆకుల సతీష్ కుమార్ అధ్వర్యంలో జరుగును. సంప్ర. : 87122 33082, 98663 55781, 99127 61533.

AJT - 1128

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మధుమేహ వ్యాధికి చికిత్స అవసరం


మధుమేహ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వైద్యులు

కుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్సలు అందించడం అవసరమని పీఈఎస్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్య, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర నాయుడు అన్నారు. ఆసుపత్రిలో మంగళవారం ఉచిత మధుమేహ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఈఎస్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో బెంగళూరుకు చెందిన ప్రఖ్యాతిగాంచిన ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ సుష్మ పర్యవేక్షణలో ప్రతి బుధవారం చిన్నపిల్లలు మధుమేహ వ్యాధికి అత్యాధునిక సేవలు పొందవచ్చని చెప్పారు. ఆసుపత్రి డయాబెటిక్, ఎండోక్రైయిన్ కేంద్రం బెంగళూరు వారి సహకారంతో మధుమేహ వ్యాధిగ్రస్తుల కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడానికి గ్లూకోమీటర్, ఇన్సులిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తమ ఆసుపత్రి చిన్నిపిల్లల విభాగంలో సుమారు 30 మంది పిల్లలకు మధుమేహ వైద్య అందిస్తున్నామన్నారు. తమ పిల్లలకు మెరుగైన జీవన నాణ్యతను అందించేందుకు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి పరామర్శ


మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డిని పరామర్శిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం మోటుమల్లెల మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు అనారోగ్యంతో బాధపడుతున్నందున పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, పుంగనూరు నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగిశెట్టి నాగరాజ, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, నాయకులు మదనమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అమరనాథరెడ్డి, శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు ప్రజలు సహకరించాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని ప్రజలు పారిశుధ్య పనులకు సహకరించాలని పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పంచాయతీలోని ఫజులూపేట, సర్వర్‌పేటలో చేపట్టిన మురుగునీటి కాలువల శుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ఇంటింటికీ చెత్తబుట్టలు అందించారని.. పారిశుధ్య కార్మికులు వచ్చినపుడు పొడి తడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒక్కసారి క్లోరినేషన్ చేయాలన్నారు. ఇంటి పన్నులు సక్రమంగా చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం


సభ్యత్వం కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

గుడుపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమమే పార్టీ ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షులు బాబు నాయుడు, నేతలు చంద్రశేఖర్, మునిరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల టీడీపీ కార్యాలయంలో సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం పంచాయతీల్లో సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు హేమాంబర్ గౌడు, బేటప్ప నాయుడు, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, లక్ష్మీపతి, గోవిందస్వామి, ఉదయ్ కుమార్, ప్రకాష్, మంజునాథ్, వెంకటేష్, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

వి.కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలమనేరు డీఎస్పీ డి.ప్రభాకర్ అన్నారు. మంగళవారం వి.కోట అర్బన్ స్టేషన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ముద్రించిన కరపత్రాలు, గోడపత్రికలను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. సీఐ సోమశేఖర్, ఏఎస్సై మురళీ, ఐసీడీఎస్ పీడీ మురళీ, సిబ్బంది సుమ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు వెండి కిరీటం విరాళం


వెండి కిరీటం అందిస్తున్న దాత మోహన్‌రెడ్డి

చౌడేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మకు అమ్మవారి భక్తుడు వెండి కిరీటం విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన దాత మోహన్‌రెడ్డి అమ్మవారికి 250 గ్రాముల వెండి కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌతం రెడ్డి, వెంకటమునియాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE(SENIOR DIVISION) :: PALAMANER
I.P.No: 9/2021

Between:
S. Venkata Ramana Reddy, S/o Late S. Eswar Reddy, aged about 59 years, Hindu, Reddy by caste, Residing at Door No. 4-279/2, Krishnana Street, Sai Nagar, Gangavaram Mandal and Post, Chittoor District, A.P., Pin 517 408. Cell No. 98669 49861, Aadhaar No. 390072419901.
..Petitioner

And

Sasi, S/o Ganesh and 24 Others. R-25 C.Hema Kumar Reddy, S/o Late Narasimha Reddy, aged about 36 years, Hindu, Reddy by Caste, residing at Mamadugu Village, Gangavaram Mandal, Chittoor District, A.P. Pin: 517 408 Cell: 9701871355/ 9100510608. Aadhaar No. not known. E-mail address not know.
.. Respondents 1 to 25

The Petitioner filed the above IP to declare the Petitioner as insolvent one and the above case is posted to 11-4-2025 take notice and file objections if any otherwise the matter will be decided exparte one.

Sri K.S. Rajendra Prasad, Sri B.S.Ashok Kumar, A. Kavitha Rani Advocates, Palamaner.

Advocates for Petitioner
B.S. Ashok Kumar, B.Com.,L.L.B.,
A. Kavitha Rani,
Advocates, Palamaner,
Cell:9440012997

ఒంటిమిట్టకు ఆర్టీసీ సర్వీసులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న ఒంటిమిట్టకు పుంగనూరు నుంచి ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. పుంగనూరు నుంచి రాయచోటి, కడప మీదుగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రాను పోను పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.350 ఛార్జీలు వసూళ్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సింహవాహనంపై కాశీవిశ్వేశ్వరస్వామి విహారం


సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

రామకుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం సింహ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేపట్టారు.

విద్యుత్ తీగల చోరీ

సోమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమల-నెల్లిమంద రోడ్డు మార్గంలోని వ్యవసాయ పొలాల వద్ద వ్యవసాయ మోటార్లకు అమర్చిన విద్యుత్ తీగలను చోరీ చేసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. సోమలకు చెందిన ఐలా వెంకటరమణ, డొంగరి మనోహర్‌లకు చెందిన వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్తు తీగలు కత్తిరించి చోరీ చేసినట్లు బాధితులు వాపోయారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు

సోమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత కారణంగా ఉపాధి పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సోమల మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల వద్ద కూలీలకు తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్లు, నీడ సౌకర్యం పరిశీలించారు. కూలీలకు వేసవిలో వేతనం పెంపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు చేరుకుని గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఏపీవో షౌఖత్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వారంలో రెండు రోజులపాటు రాత్రివేళ పోలీసులు గ్రామస్తులతో కలిసి నిద్రపోతున్నట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం పుంగనూరు పోలీసుస్టేషన్‌లో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు గ్రామాలను ఎంపిక చేసుకుని ఒక రోజు ఎస్ఐ, రెండో రోజు సీఐ గ్రామస్తులతో కలిసి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ కక్షలు, గ్రామంలో ప్రజల మధ్య ఉన్న చిన్న చిన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అలాగే పట్టణంలో రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేని స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పుంగనూరు సీఐ రాంభూపాల్, ఎస్ఐ లోకేశ్ పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేకాలంకరణ



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భీమగానిపల్లె బైపాస్‌రోడ్డు వద్ద వెలసిన వీరాంజనేయ స్వామి మంగళవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే తమలపాకులతో తోరణాలు కట్టి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘ సభ్యులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానాల సౌకర్యం, శ్మశానాలకు దారులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజన పాఠశాల ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు మునేంద్రనాయక్, రామయ్య, చిన్నరాయుడు, నాగరాజ, వెంకటరమణ, హరి, శివప్ప, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పదోష నివారణ పూజలు


ఆలయంలో సర్పదోష నివారణ పూజలు చేస్తున్న పూజారులు

రామకుప్పం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

మెరుగైన జీవనోపాధులకు సర్వే

సోమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు అవసరమైనప్పుడు రుణాలు తీసుకునే విధంగా వార్షిక రుణ ఆర్థిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఏపీఎం శివయ్య తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో జరిగిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రతి సంఘంలోని గ్రూప్ సభ్యులందరూ కలిసి రుణాలు తీసుకోవడం.. చెల్లించడం జరుగుతుందని, అలా కాకుండా అవసరం ఉన్న సభ్యులు మాత్రమే రుణాలు తీసుకునే విధంగా నూతన విధానంపై సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించిన మహిళల అభిప్రాయాలను సేకరించారు. తీసుకున్న రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. సమావేశంలో సీసీలు గంగోజీ, వాహిద్‌బాషా, మునిరత్నం, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

సదుం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతపర్తివారిపల్లె, పిడుగులవారిపల్లె ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ఆర్ఐ సుమలత క్రీడాసామాగ్రిని మంగళవారం అందించారు. దాతకు హెచ్ఎం లక్ష్మీనారాయణ విద్యార్థుల తనపున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు సిద్ధరామయ్య, దామోదర్, ఎస్టీయూ నాయకులు మోహన్ కుమార్, కిశోర్ కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధి కలేనా..!

- దుస్థితిలో యార్డులోని భవనాలు
- కనిపించని శీతలీకరణ గోదాములు
- పంటలు నిల్వ చేసుకోలేక రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నిరుపయోగంగా ఉన్న రొంపిచెర్ల మార్కెట్ యార్డు , దుస్థితిలో భవనాలు

రొంపిచెర్ల ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మార్కెట్ యార్డులో ఎన్ని మార్పులు జరిగినా.. కమిటీ ఛైర్మన్లు మారినా అభివృద్ధి మాత్రం శూన్యం. రైతులకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా మారింది. పీలేరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న రొంపిచెర్లను 15 ఏళ్ల క్రితం విడదీసి చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం, రొంపిచెర్ల మండలాలను కలిపి రొంపిచెర్ల మార్కెట్ కమిటీగా ఏర్పాటు చేశారు. కొంత కాలం తర్వాత తిరిగి రొంపిచెర్ల-పులిచెర్ల మండలాలకు కలిసి మార్కెట్ యార్డుగా ఏర్పాటుచేశారు. మార్కెట్ కమిటీకి సుమారు 14 ఎకరాల స్థలం గతంలో కేటాయించారు. మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ముగ్గురు మార్కెట్ కమిటీ ఛైర్మన్లు పనిచేసినా అభివృద్ధి మాత్రం జరగలేదు. కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన ప్రతిఒక్కరూ తాను గొప్పగా అభివృద్ధి చేస్తామని చెప్పడం పరిపాటిగా మారింది. రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకుకునేందుకు వసతులు, శీతలీకరణ గోదాములు, టమోటా, మామిడి విక్రయాలకు మార్కెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అలాగే పశుపోషణ శిబిరాలతో పాటు గొర్రెలు, మేకలు , పశువుల సంతలు ఏర్పాటు చేస్తామని రైతులకు వాగ్దానాలు సైతం చేసి అచరణలో పెట్టలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. మార్కెట్ యార్డులో ఉన్న గోదాము సివిల్ సప్లై సరుకులు నిల్వ చేసుకునేందుకు అద్దెకు ఇచ్చేశారు. రైతులు పండించిన పంటలు ఎండబెట్టుకోవడానికి నిర్మించిన షెడ్డు గాలీవానలకు పడిపోయింది. తర్వాత నిర్మించే చర్యలు తీసుకోలేదు. గోదాములు లేకపోవడంతో రైతులు పండించిన వరి, మామిడి, వేరుశనగ వంటి పంటలు నిల్వ చేసుకోలేకపోతున్నారు. ఇళ్లల్లో నిల్వచేసుకునే సౌకర్యంలేని రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. సీజన్ బట్టి మామిడి, టమోటా పంటలను ప్రైవేటు వ్యాపారులు స్థానికంగా మార్కెట్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై తదితర పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మార్కెట్ యార్డు సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రొంపిచెర్ల మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి



రొంపిచెర్ల మార్కెట్ యార్డులో రైతులకు కనీస సౌకర్యాలు లేవు. దుస్థితిలో ఉంది. రైతులు పండించే పంటలు నిల్వచేసుకునే సౌకర్యం, మార్కెటింగ్ వసతి లేదు. నష్టాల నుంచి రైతులను ఆదుకోవాలి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం అయినా మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

\- మదన్‌మోహన్, రొంపిచెర్ల

సంతలు.. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



మార్కెట్ యార్డులో పశువుల సంత ఏర్పాటు చేయాలి. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. దీంతో మార్కెట్‌కు రాబడి పెరగడంతో పాటు పాడి రైతులకు సాయం అందుతుంది. వచ్చే కమిటీ ఛైర్మన్లు అయినా అభివృద్ధిపై దృష్టి సారించాలి.

\- ఎస్.రామమూర్తి, రొంపిచెర్ల

మహిళా సాధికారతే చంద్రబాబు లక్ష్యం

తలసరి ఆదాయం పెంపునకు ప్రభుత్వం కృషి


శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండల సచివాలయంలో మంగళవారం అలీప్ సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా శిక్షణ పొందిన 50 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సహకారంతో కుప్పంలో అలీప్ సంస్థ మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తగిన శిక్షణ, సదుపాయాలు కల్పించడానికి ముందుకు రావడం హర్షణీయమని పేర్కొన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ అలీప్ సంస్థ ఇచ్చిన శిక్షణతో పారిశ్రామికంగా ఎదగాలని ఆకాంక్షించారు. తగిన రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు ప్రభుత్వం కల్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. నేతలు సురేశ్‌బాబు, రాజ్‌కుమార్, కన్నన్, అధికారులు పాల్గొన్నారు.

కుప్పానికి పరిశ్రమలు రాబోతున్నాయ్

త్వరలోనే కుప్పానికి పరిశ్రమలు రాబోతున్నాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు.దీనికి సమాంతరంగా మహిళల సాధికారత కోసం ఆర్థిక అభ్యున్నతి కోసం అవసరమైన శిక్షణలను, కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.టీడీపీ కార్యాలయంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, ఇతర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.త్వరలో ఎయిర్‌పోర్టు పనులు మొదలువుతాయని తెలిపారు. చంద్రబాబు విజన్‌తో కుప్పం ఒక మోడల్ నియోజకవర్గంగా రూపొంది రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.కుప్పం మున్సిపల్, కుప్పం రూరల్, శాంతిపురం, రామకుప్పం మండలాల టీడీపీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్ కుమార్, విశ్వనాథరెడ్డి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు


బోరును పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపల్లె, సి.బండపల్లె, కర్లగట్ట గ్రామాల్లో తాగునీటి సరఫరాను ఎంపీడీవో కుమార్ మంగళవారం పరిశీలించారు. గత వారం కడపల్లె, సి. బండపల్లె, కర్లగట్ట గ్రామాల్లో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీవో గ్రామాల్లో నూతన బోరును ఏర్పాటు చేయించారు. గ్రామాలకు వెళ్లి నీటి సరఫరాను పరిశీలించారు. నీటి సమస్య పరిష్కారంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి చంద్రబాబు కృషి


సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న నేతలు

గుడుపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకొన్న 11 మంది బాధితులకు నాయకులు చెక్కులను పంపిణీ చేశారు. కంచిబందార్లపల్లెకు చెందిన హరిదేవికి రూ.15 వేలు, పెద్దన్నకు రూ.30 వేలు, మురుగేష్‌కు రూ.20 వేలు, గుడుపల్లె కాలనీకి చెందిన భూలక్ష్మమ్మకు రూ.2 లక్షలు, కాడేపల్లె చెందిన వెంకటలక్ష్మీకి రూ.1.95 లక్షలు, తంబిగానిపల్లె చెందిన సుబ్రహ్మణ్యానికి రూ.66 వేలు, చీకటిపల్లెకు చెందిన నారాయణ రూ.2.75 లక్షలు, గుడుపల్లె చెందిన శీనప్పకు రూ.54 వేలు, యామిగానిపల్లెకు చెందిన శ్రీనివాసులుకు రూ.58 వేలు, డిల్లీబాబుకు రూ.55 వేలు, బెగ్గిలపల్లెకు చెందిన రాజేశ్వరికి రూ.51 వేలు, గుత్తార్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యానికి రూ.1.33 లక్షల చెక్కులను అందించారు. సీఎం సహాయ నిధి చెక్కులను అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తూ చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు బాబు నాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, సుబ్రహ్మణ్యం, హేమాంబర్‌గౌడు, బేటప్ప నాయుడు, భానుమూర్తి, ముంజునాథ్, గజేంద్ర, అంబరిష్ తదితర్లు నాయకులు పాల్గొన్నారు.

నేడు కల్లూరుకు చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ బంగ్లా ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్న టీడీపీ కార్యకర్తల సమావేశానికి పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సమావేశం అనంతరం ఆయన చేతుల మీదుగా టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ జరుగుతుందని, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు ధనంజయులు నాయుడు, సుబ్బారెడ్డి కోరారు.

10న ఉద్యోగమేళా

చౌడేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన స్థానిక వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం మణి పేర్కొన్నారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివి 30 ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న భార్యతో గొడవపడి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ ఆరంట్లపల్లెకు చెందిన రామప్ప కుమారుడు సుబ్రహ్మణ్యం(32) తన భార్యతో ఘర్షణ పడి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మధురమలై కొండకు నిప్పు

సోమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట చెన్నపట్నం చెరువు సమీపంలోని మధురమలై కొండకు మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈక్రమంలో కొండలోని పలు వృక్షాలు అగ్నికి ఆహుతయ్యాయి. కొండ సమీపంలోని మామిడి, టమోటా తోటల రైతులు తమ పొలాల వైపు మంటలు వ్యాపించకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. కొండలోని వన్య ప్రాణులు పొలాల వైపు రావడంతో ఆందోళన పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన యోగరాజు

సదుం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం సదుంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం తుమ్మపాళెంకు చెందిన యోగరాజు(40) ద్విచక్ర వాహనంపై కల్లూరు నుంచి సదుం వైపు వస్తుండగా మార్గంమధ్యలోని ఓ ప్రైవేటు డెయిరీ సమీపంలో ఎదురుగా వస్తున్న టెంపో ఢీకొంది. ప్రమాదంలో యోగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

సదుం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొంగివారిపల్లె పంచాయతీ రెడ్డివానికుంట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం పశువుల కాపరులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతునికి 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, నీలం రంగు లుంగీ, గళ్ల చొక్కా వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

చౌడేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భిణిని చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చౌడేపల్లె మండలానికి చెందిన 15 ఏళ్ల బాలికను నాగేంద్ర (20) అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భిణిని చేశాడన్నారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి



చౌడేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్ జయప్రకాష్ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు .. మండలంలోని బైప్పల్లెకు చెందిన గోపాల్ కుమారుడు జయప్రకాష్ (32) మదనపల్లెలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 5న బెంగళూరులో రోడ్డుపై వెళుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడి తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతికి పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు.

పూతలపట్టును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే మురళీమోహన్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూతలపట్టు చెరువుకట్టపై జరుగుతున్న పనులను పరిశీలించి, చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి నీవానది బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రంగంపేట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సెరికల్చర్ ఆఫీసు శిథిలావస్థలో ఉండడంతో ఆ స్థలంలో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. పి.కొత్తకోట రెవెన్యూలో ఏపీఐఐసీ కోసం భూమిని పరిశీలించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద రాత్రిపూట వీధిదీపాలు వెలగడం లేదని, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే ఎంపీడీవోతో మాట్లాడి, వారం రోజుల్లోగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, టీడీపీ నాయకులు గుంటూరు మురళి, దాము, నేతాజి నాయుడు, దామోదర్, కొంకా నాగరాజు, హరి, మంజునాథ్, చిరంజీవి, గణపతి నాయుడు, భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఏపీవోలు సంధ్యారాణి, ఇందు, ఎంపీడీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌వన్నీ హత్యా రాజకీయాలే..: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌వన్నీ హత్యా రాజకీయాలేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో వైసీపీ నేత లింగమయ్య హత్యకు గురయ్యారని అక్కడ పర్యటించిన జగన్ మీడియాతో పూనకం వచ్చినట్లు మాట్లాడారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలకు ఆద్యుడు జగన్ రెడ్డేనని, ఆయన తాత రాజారెడ్డి ఫ్యాక్షనిస్టు కాదా అని ప్రశ్నించారు. లింగమయ్య హత్య వైసీపీ నేతల ఆధిపత్య పోరులో జరిగిందని, ఈ హత్యకు టీడీపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని జగన్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవ చేశారు. నేతలు మోహన్ రాజ్, మేషాక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందడం లేదు

● తహసీల్దార్‌కు రేషన్ కార్డుదారుల ఫిర్యాదు

వెదురుకుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తమకు నిత్యావసర సరుకులు అందడం లేదని కార్వేటినగరం బీసీకాలనీ రేషన్‌కార్డుదారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ నాగరాజును కలిసి ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా ఎండీయూ వాహనం రిపేరులో ఉందని చెబుతూ ఆపరేటర్ ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనివల్ల తమకు సరుకులు సక్రమంగా అందడం లేదని వాపోయారు. దీంతో తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారని గ్రామస్తులు పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎంపీ పరామర్శ



నాదముని సమస్య తెలుసుకుంటున్న ఎంపీ ప్రసాదరావు

పెనుమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగుమానుపల్లె దళితవాడకు చెందిన టీడీపీ కార్యకర్త నాదముని ఇటీవల వెన్నుపూస సమస్యతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళవారం నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు విషయం తెలియడంతో నాదముని ఇంటికెళ్లి పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, బీసీ నేతలు శ్రీధర్‌యాదవ్, కోదండయాదవ్, మాజీఎంపీపీ షణ్ముగవర్మ, బాలాజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో తనిఖీలు

గంగాధరనెల్లూరు: సర్విరెడ్డిపల్లె బస్టాప్‌కు సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం సాయంత్రం ఎంపీ తనిఖీ చేశారు. ఇక్కడి సమస్యలను ప్రిన్సిపాల్ దమయంతి ఎంపీకి తెలియజేయగా, త్వరలోనే పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. అనంతరం విద్యార్థినులతో కొంతసేపు ఎంపీ ముచ్చటించారు. టీడీపీ నాయకులు సప్తగిరి ప్రసాద్, కోదండయాదవ్, చిన్నస్వామి, శ్రీధర్‌యాదవ్, ఇందిరమ్మ, క్షీరసముద్రం రాజశేఖర్‌నాయుడు, వేపంజేరి మురుగేష్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించండి



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటప్రసాద్

ఐరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం ఐరాల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్తుల పేర్లను గోప్యంగా ఉంచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, పీహెచ్ఎన్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

21 మందికి రూ.2.10 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 21మందికి జరిమానా విధించారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. 21 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు ప్రవేశపెట్టారు. విచారించిన ఆమె.. ఒక్కొక్కరికి రూ.10వేల వంతున 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



పచ్చికాపల్లం పీహెచ్‌సీలో బాధితురాలికి కిట్ అందజేస్తున్న అధికారులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె, వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లను మంగళవారం జిల్లా మలేరియా నివారణ అధికారి బి.వేణుగోపాల్, పుత్తూరు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.మోహన్‌బాబు పంపిణీ చేశారు. వైద్యాధికారులు హేమశ్రీ, భువనేశ్వరి, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పెరటి తోటలతో ఆరోగ్యం

విజయపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెరటి తోటలతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి రజినీకుమారి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో రైతు సాధికార సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రకృతి సేద్యం వైపు పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, ఏపీఎం శ్రీహరి, ఎన్ఎఫ్ఎంఐ ప్రతాప్, ఎన్ఎఫ్ఏ గురుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో దక్షిణ మధ్య రైల్వే ఐజీ



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని దక్షిణ మధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈమెకు స్వామి వారి జ్ఞాపికను ఏఈవో రవీంద్రబాబు అందజేశారు.

జీడీనెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తాం/ ఎంపీ ప్రసాదరావు, ప్రభుత్వ విప్ థామస్



మంగుంటలో అంగన్వాడీ కేంద్రం ప్రహరీని ప్రారంభించిన ఎంపీ ప్రసాదరావు ప్రభుత్వ విప్ థామస్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. మంగళవారం మంగుంటలో అంగన్వాడీ కేంద్రం ప్రహరీ, గోకులం షెడ్, రూ.28లక్షల ఎంపీ నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వీరిద్దరూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లోనూ అభివృద్ధి పనులు సమానంగా చేపడతామని చెప్పారు. థామస్ మాట్లాడుతూ.. తమ ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో 2వేల ఎకరాలతో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు కోదండ యాదవ్, జీవన్ రెడ్డి, హిమాచలపతిరెడ్డి, గంధమనేని రాజశేఖర్ నాయుడు, చంద్రబాబు రెడ్డి, ఎస్.కుమార్, చందు, పైనేని మురళి, నీరంజన్‌రెడ్డి, సిద్దయ్య శెట్టి, గుండయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడా' పోస్టర్ల ఆవిష్కరణ

వెదురుకుప్పం: మండల కేంద్రంలో పోషణ్ పక్వాడా పోస్టర్లను ఎంపీ, ప్రభుత్వ విప్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పద్మసునంద, సూపర్‌వైజర్లు భారతి, శకుంతల, అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

కనీసం వేతనం రూ.26వేలివ్వండి

● ఆశా కార్యకర్తల డిమాండ్



బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీలో వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

నగరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తమకు నెలకు కనీస వేతనం రూ.26వేలను ఇవ్వాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి చందామరై, పీహెచ్‌సీ నాయకులు హంస, రూప, రాజేశ్వరి, విజయలక్ష్మి, గీతాలక్ష్మి, పుష్ప, జయసుధ పాల్గొన్నారు.

విజయపురం: ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మండల కేంద్రంలోని వైద్యాధికారి విష్ణుప్రియకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. గ్రాట్యుటీ రూ.50 వేలు ఇవ్వాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, మెటర్నటీ సెలవులు 180 ఇవ్వాలని కోరారు. ఆశ వర్కింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, నేతలు సలీనా, భువన, ముని, లక్ష్మి, లత, షీబా, ఝాన్సీ, రేవతి, మంజుల పాల్గొన్నారు.

శేష, చంద్ర ప్రభ వాహనాలపై శ్రీరామచంద్రమూర్తి విహారం



శేష వాహనంపై సీతారాములకు హారతి ఇస్తున్న అర్చకుడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండరామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శేష, చంద్ర ప్రభ వాహనాలపై సీతా సమేతంగా శ్రీరాముడు విహరించారు. ఉదయం సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఓవీసీ జ్యువెలరీస్, సతీష్ కుమార్, ఎ.రంజిత్, నాగరాజన్, పీవీసీ జ్యువెలరీస్ ఉభయంతో ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు శేష వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం వి.రామచంద్రనాయుడు, వి.జయచంద్రనాయుడు, మిట్టా బ్రదర్స్ ఫ్యామిలీ, జీజే రవీంద్రాథ్ ఉభయంతో చంద్రప్రభ వాహనసేవ జరిగింది. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అగస్త్యేశ్వరుడి రథోత్సవం



స్వామివారి రథోత్సవ సేవలో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో పంగుణి మాస ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకుడు శివకుమార్ శివాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి.. రథంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ చిత్తూరు మాజీ ఎమ్మెల్యే లేట్ సి.కృష్ణారెడ్డి, లేట్ సి.పి.రాజేంద్రరెడ్డి, లేట్ జ్యోతీశ్వరరెడ్డి కుటుంబీకుల ఉభయంతో రథోత్సవ సేవను ఈవో వెంకటరాయలు నిర్వహించారు. సాయంత్రం నీవానది తీరాన లేట్ డి.సుబ్రహ్మణ్యం కుటుంబీకుల ఉభయంతో గంగాదేవికి అభిషేకం, పూజలు చేశారు. కాలభైరవ ట్రస్టు వ్యవస్థాపకుడు వెంకటేషన్, లత జ్యువెలరీస్ అధినేత మల్లి ఆచారి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై రాములోరు



తవణంపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అరగొండ కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతా సమేతుడైన కోదండరాముడు హనుమంత వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే సాయంత్రం ఉత్సవర్లను హనుమంత వాహనంపై అధిష్ఠింపజేసి, మేళ తాళాల నడుమ అరగొండ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు వెండి కిరీటం విరాళం

చౌడేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మకు అమ్మవారి భక్తుడు వెండి కిరీటం విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన దాత మోహన్‌రెడ్డి అమ్మవారికి 250 గ్రాముల వెండి కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌతంరెడ్డి, వెంకటమునియాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలం కేటాయింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించినట్లు తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న 20 సెంట్ల స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయించినట్లు చెప్పారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ యోగానందతో కలిసి మంగళవారం స్థలాన్ని పరిశీలించి, దస్తావేజులను ఆయనకు అందజేశారు. త్వరలో కార్యాలయ నిర్మాణానికి అవసరమైన నివేదికలు ప్రభుత్వానికి పంపిస్తామని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

ప్రకృతి సేద్యంపై మొగ్గుచూపండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ ఉమ

గుడిపాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంపై రైతులు మొగ్గుచూపాలని వ్యవసాయ శాఖ ఏడీ ఉమా అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి సేద్యంపై రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేతలు చెన్నకేశవులు నాయుడు, బాలాజీ నాయుడు, ఏవో మాధవి, వెలుగు సీసీ లోకనాథరెడ్డి, శిక్షణ సిబ్బంది కవిత, నీలకంఠారెడ్డి, సర్పంచ్ గురప్పనాయుడు, మాజీ సర్పంచ్‌లు హరిబాబు నాయుడు, రవి నాయుడు, పాల్గొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

యాదమరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.8330 స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. వరిగపల్లె గ్రామ శివారులోని మామిడి తోపులో మంగళవారం పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు.

పీఈఎస్ విద్యార్థులకు అభినందన



యాదమరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు పలు పోటీల్లో సత్తాచాటారని నిర్వాహకులు తెలిపారు. విజయవాడలో ఈనెల ఐదో తేదీన నిర్వహించిన 12వ అఖిల భారత బాలలు, యువత కళాపోటీల్లో భాగంగా పాఠశాలకు చెందిన నోషిత (9వ తరగతి), ఎన్.జె.లహరి (11వ తరగతి)లు ఆలిండియా బాల చిత్రకళా అవార్డును సొంతం చేసుకున్నారు. తొమ్మిది విద్యార్థులు వివిధ విభాగాల్లో బంగారు పతకాలను, 11 మంది వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఆర్ట్ మాస్టర్ దినేష్‌కు ఆలిండియా చిత్రకళా అవార్డు లభించింది. ప్రతిభ చూపిన వారిని ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు మంగళవారం అభినందించారు.

భార్యపై యాసిడ్ పోసిన వ్యక్తి అరెస్టు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాపురానికి రాలేదన్న కోపంతో భార్యపై యాసిడ్ పోసిన భర్తను అరెస్టు చేశారు. రెండు నెలలకు ముందు దావూద్, రేష్మ దంపతులు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం రాంనగర్‌కాలనీలో ఉంటున్న భార్య ఇంటికెళ్లి బయటకు రమ్మని దావూద్ కోరాడు. ఆమె రాగానే ముఖంపై బ్యాటరీలకు వాడే యాసిడ్‌ను పోశాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో మంగళవారం నిందితుడిని దర్గా జంక్షన్ వద్ద పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

సదుం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడని పోలీసులు తెలిపారు. బంగారుపాళ్యం మండలం తుమ్మపాళెంకు చెందిన యోగరాజు(40) ద్విచక్ర వాహనంపై కల్లూరు నుంచి సదుం వైపు మంగళవారం వస్తున్నాడు. మార్గంమధ్యలోని ఓ ప్రైవేటు డెయిరీ సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొంది. యోగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

● పరిస్థితి విషమం



కేశవపురం వద్ద రోడ్డు పక్కన తవ్విన గుంత



మహారాజపురం సమీపంలో గాయపడ్డ సుబ్రహ్మణ్యం

విజయపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జంబాడ ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం (32) ద్విచక్ర వాహనంలో మంగళవారం కనకమ్మసత్రంకు బయల్దేరారు. మహారాజపురం - కేశవపురం మార్గంమధ్యలో ఎదురుగా లారీ రావడంతో పక్కకు తప్పుకోవడానికి ప్రయత్నం చేశాడు. రోడ్డు పక్కన మట్టి తవ్వడంతో దానిపై పడి గాయపడ్డాడు. బాధితుడిని 108 వాహనంలో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు.

రోజూ ప్రమాదాలే

మండలంలో చిన్నజంబాడ నుంచి కనకమ్మ సత్రం, నారపరాజు కండ్రిగ వరకు రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన ఫైబర్ నెట్ పేరుతో విచ్చల విడిగా రోడ్డును తవ్వి గుంతలు పూడ్చకపోవడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. మరో వైపు గ్రావెల్ క్వారీ లారీలతో ఇబ్బంది తప్పడం లేదన్నారు. రోడ్డుపై మట్టి పడడంతో ద్విచక్ర వాహనం జారి ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సంక్షిప్తంగా..

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకం



వెదురుకుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలి: సీడీపీవో

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణి అయినప్పటి నుంచి పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలకు 'పోషణ్ పక్వాడా'పై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, విద్యాశాఖ సీఆర్‌పీ గుణశేఖర్ పాల్గొన్నారు.

నగరి: 'పోషణ్ పక్వాడా'పై ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు యూనిఫాం పంపిణీ

గుడిపాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లందరికీ యూనిఫాంను గుడిపాల పీహెచ్‌సీలో వైద్యాధికారి సంధ్య మంగళవారం పంపిణీ చేశారు. పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌వో బాలసూర్యనారాయణ, సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పాలసముద్రం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి కోరారు. మంగళవారం తన కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

పూతలపట్టు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు పీహెచ్‌సీని జిల్లా ఎయిడ్స్, టీబీ వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ మంగళవారం సందర్శించారు. పీహెచ్‌సీ ఆవరణంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో జరుగుతున్న సమావేశానికి హాజరై.. సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ సంధ్య, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

పాలసముద్రం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా మండల ప్రజలు జాగ్రత్తలు పాటించేలా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలని డాక్టర్ కృష్ణమోహన్ చెప్పారు. మంగళవారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు.

పెనుమూరు: ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనశైలిపై అవగాహన కల్పించాలని డాక్టర్ సంధ్య సూచించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవణలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమీక్షించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

మధురమలై కొండకు నిప్పు

సోమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట చెన్నపట్నం చెరువు సమీపంలోని మధురమలై కొండకు మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పలు వృక్షాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమీపంలోని మామిడి, టమోటా తోటల రైతులు తమ పొలాల వైపు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు.